ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 30 అక్టోబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

# 6 నుంచి తెలంగాణలో కులగణన

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించాలని రాష్ట్ర నాయకత్వం యోచన



**హైదరాబాద్, ప్రజాస్వరం:** నవంబర్ 6 నుంచి తెలంగాణలో కులగణన ప్రక్రియను ప్రారంభించనున్నారు. దేశంలో తొలిసారిగా ఇక్కడ కులగణన చేపట్టనున్నారు. నవంబర్ 6న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించాలని రాష్ట్ర నాయకత్వం యోచిస్తోంది. ఈమేరకు గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. కులగణన తర్వాత ఏయే సంక్షేమ కార్యక్రమాలకు ఎంత నిధులు కేటాయించాలో తెలిసే అవకాశం ఉంది. త్వరలో దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రులు తెలిపారు.

### భవిష్యత్‌లో దేశమంతా తెలంగాణను అనుసరిస్తుంది: భట్టి



త్వరలో అన్ని జిల్లాల్లో కులగణనపై సమావేశాలు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకోవడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ హామీ మేరకు కులగణన చేస్తున్నామన్నారు. సర్వేతో అందరి సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేశమంతా తెలంగాణను అనుసరిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

# కేసీఆర్ అంటేనే తెలంగాణ చరిత్ర..

### మీరా ఆయన పేరును తుడిచేది?

పదవుల కోసం రేవంత్‌రెడ్డి పరితపన
ఉన్న పదవినే వదిలేసిన వ్యక్తి
బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడికే దక్కింది
మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్: పదవుల కోసం రేవంత్‌రెడ్డి పరితపిస్తున్నప్పుడు కేసీఆర్ ఉన్న పదవే వదిలేశారని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "ఉద్యమకారులపై గన్ను ఎక్కు పెట్టినప్పుడు కేసీఆర్ ప్రాణాన్నే ఫణంగా పెట్టారు. తెలంగాణను చంపేందుకు రేవంత్ బ్యాగులు మోసిన సమయంలో.. ఆయన రాష్ట్ర భవిష్యత్తుకు ఊపిరి పోశారు. కేసీఆర్ అంటేనే తెలంగాణ చరిత్ర.. మీరా ఆయన పేరును తుడిచేది?" అని కేటీఆర్ పేర్కొన్నారు.

మూసీపై ముందుకు.. కొనుగోళ్లపై వెనక్కు అని కేటీఆర్ విమర్శించారు. "రామన్నపేటకు రైరై.. కొనుగోలు సెంటర్లకు నైనై. దామగుండం ధనాధన్.. ధాన్యం కొనుగోళ్లు డాండాం. కొనుగోళ్లకు దిక్కులేదు.. కాంగ్రెస్ కోతలకు లెక్కలేదు. దళారులకు దండిగా.. రైతన్నలకు దండగా. ఎద్దేడ్చిన వ్యవసాయం.. రైతు ఏడ్చిన రాజ్యం ఎప్పుడూ బాగుపడదు" అని 'ఎక్స్'లో పోస్టు చేశారు.

# విచారణకు రాజ్ పాకాల

### మోకిల పోలీసుల ఎదుట న్యాయవాదితో హాజరు
### ఆయనపై రెండు కేసులు నమోదు



హైదరాబాద్: జన్వాడ ఫామ్‌హౌస్ కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల మోకిల పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. న్యాయవాదితో పాటు ఆయన విచారణకు వచ్చారు. ఇటీవల రాజ్ పాకాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పార్టీ కేసుకు సంబంధించి విచారించాల్సి ఉందని అందులో పేర్కొన్నారు. జన్వాడలో ఫామ్‌హౌస్‌పై ఇటీవల సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. ఇక్కడి రిజర్వ్ కాలనీలో ఉన్న రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి పార్టీ నిర్వహించారు.

భారీ శబ్దాలతో ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. 21 మంది పురుషులు, 14 మంది మహిళలను అదుపులోకి తీసుకున్నారు. 35 మందితో నిర్వాహకులు మద్యం పార్టీ నిర్వహించారు. డ్రగ్స్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు.. రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారించారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగానే రాజ్ పాకాలకు నోటీసులు ఇచ్చారు. ఆయనపై రెండు కేసులు నమోదయ్యాయి.

## దర్శన్‌కు మధ్యంతర బెయిల్

### రేణుకాస్వామి హత్యకేసులో జూన్ 11న అరెస్ట్
### సర్జరీ కోసం బెయిలు కావాలంటూ పిటిషన్
### ఆరు వారాలకు మంజూరు



**బెంగళూరు :** అభిమాని రేణుకాస్వామి హత్యకేసులో జైలుకెళ్లిన కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు కర్ణాటక హైకోర్టు బుధవారం ఆరు వారాల మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. సర్జరీ కోసం బెయిలు కావాలంటూ దర్శన్ పెట్టుకున్న పిటిషన్‌పై నిన్ననే వాదనలు ముగిశాయి. తీర్పును నేటికి రిజర్వు చేసిన జస్టిస్ ఎస్ విశ్వజిత్ శెట్టి నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం తాజాగా మధ్యంతర బెయిలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. అభిమాని హత్య కేసులో జూన్ 11న దర్శన్ అరెస్టయ్యాడు. సహనటి పవిత్రగౌడకు రేణుకాస్వామి అసభ్యకర సందేశాలు పంపడంతో ఆగ్రహించిన దర్శన్ అతడిని చిత్రహింసలు పెట్టి హత్య చేసినట్టు ఆరోపణలున్నాయి. కలవాలని పిలిపించి దారుణంగా హత్యచేసినట్టు పోలీసులు తెలిపారు. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి షాక్, గాయాల కారణంగా రక్తస్రావంతో మరణించినట్టు పోస్టుమార్టం రిపోర్టులో తేలింది. ఈ కేసులో పవిత్రగౌడ ప్రధాన ముద్దాయిగా ఉన్నారు.

## కుల గణన కోసం అఖిలపక్ష సమావేశం

### త్వరలో ఏర్పాటు చేస్తాం
### 6 నుంచి ప్రక్రియ ప్రారంభం : మంత్రి పొన్నం



**హైదరాబాద్, ప్రజాస్వరం :** కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు దేశంలో మొదటిసారి సమగ్ర కుల గణన ప్రక్రియ ఈనెల 6 వ తేదీన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా అందరు సహకరించాలన్నారు. దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాలలో అధికారులకు సహకరించాలని సూచించారు. 150 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు


## ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

**హైదరాబాద్ :** ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జీడిమెట్ల పరిధి షాపూర్‌నగర్ చౌరస్తాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రహదారి దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పాదచారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## హై టెన్షన్ వైర్ తగిలి బాలుడికి తీవ్ర గాయాలు

### అంబర్ పేటలో ఘటన

**హైదరాబాద్, ప్రజాస్వరం :** దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. ఈ విషాదకర సంఘటన అంబర్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి అభి(14) అనే బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, అభి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## నాగార్జున, కేటీఆర్ పిటిషన్లపై విచారణ వాయిదా

### మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దావా





హైదరాబాద్, ప్రజాస్వరం : నాగార్జున, కేటీఆర్ పిటిషన్లపై విచారణను నాంపల్లి కోర్టు నవంబర్ 13కు వాయిదా వేసింది. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున, మాజీ మంత్రి కేటీఆర్ వేర్వేరుగా దాఖలు చేసిన పరువునష్టం దావా పిటిషన్లపై నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. కొండా సురేఖ తరఫున న్యాయవాది గురుమిత్‌సింగ్ హాజరయ్యారు. రెండు పిటిషన్లపై విచారణను న్యాయస్థానం నవంబర్ 13కు వాయిదా వేసింది.



## రష్మిక.. మరో ప్రాజెక్టుకు ఓకే

**సినిమా :** దక్షిణాదితోపాటు ఉత్తరాదిలోనూ వరుస చిత్రాలు చేస్తూ కెరీర్‌లో దూసుకెళ్తున్నారు నటి రష్మిక. గతేడాది 'యానిమల్'తో విజయాన్ని అందుకున్న ఆమె ప్రస్తుతం చేతినిండా చిత్రాలతో వరుస షూటింగ్స్‌తో గ్యాప్ లేకుండా గడుపుతున్నారు. తాజాగా బాలీవుడ్‌లో మరో ప్రాజెక్ట్ ఓకే చేశారు. 'స్త్రీ', 'బేడియా', 'ముంజ్య' క్రియేటర్స్ దీనిని తెరకెక్కించనున్నారు. విభిన్న కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'థమా' (Thama) అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ రష్మిక తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. "ఈ యూనివర్స్ ఒక ప్రేమ కథ కోరుకుంటుంది. దురదృష్టవశాత్తూ అది చాలా ఉద్వేగంతో కూడుకున్నది" అని టీమ్ పేర్కొంది. ఆయుష్మాన్ ఖురానా, నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ముంజ్య' దర్శకుడు ఆదిత్య సర్పోత్దార్ దీనికి దర్శకత్వం వహించనున్నారు. 'బేడియా', 'స్త్రీ' నిర్మాత దినేష్ విజన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది దీపావళి కానుకగా ఇది విడుదల కానుంది.

# మహిళా వ్యోమగామి అంతరిక్షంలోకి

**ప్రపంచం :** చైనా తమ దేశం తరఫున ఓ మహిళా వ్యోమగామిని తొలిసారి అంతరిక్షంలోకి పంపింది. తాజాగా గన్స్ ప్రావిన్స్‌లోని జియుక్వియాన్ స్పేస్ సెంటర్ నుంచి షెంఝూ-19 మిషన్‌లో భాగంగా నేడు ముగ్గురు యువ వ్యోమగాములను అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్‌కు తరలించింది. ఇందుకోసం లాంగ్‌మార్చ్-2ఎఫ్ అనే భారీ రాకెట్‌ను వాడారు. వ్యోమగాముల్లో 34 ఏళ్ల మహిళా స్పేస్ ఫ్లైట్ ఇంజినీర్ వాంగ్ హవ్రూజె కూడా ఉన్నారు. దాదాపు ఆరు గంటల పాటు ప్రయాణించిన వారు స్పేస్ స్టేషన్‌కు చేరుకొన్నారు. వీరు ప్రయాణించిన స్పేస్‌షిప్ అంతరిక్ష కేంద్రం కోర్‌మాడ్యూల్ తియాన్హేతో అనుసంధానమైంది. ఈ ముగ్గురు వ్యోమగాములు ఆరు నెలలపాటు అక్కడే ఉండి వివిధ ప్రయోగాలను, స్పేస్‌వాక్‌ను నిర్వహిస్తారు. దీనినుంచి వచ్చిన అనుభవంతో 2030 నాటికి చంద్రుడి పైకి యాత్రను చేపడతారు. ఈ ప్రయోగం విజయవంతమైందని చైనా మ్యాన్డ్ స్పేస్



ఏజెన్సీ (సీఎంఎస్ఏ) ప్రకటించింది. "వీరు వివిధ రంగాలకు చెందిన మొత్తం 86 ప్రయోగాలు నిర్వహిస్తారు. మా మిత్రదేశాల వ్యోమగాములకు కూడా శిక్షణ ఇచ్చే అంశంపై చర్చలు జరుగుతున్నాయి" అని సీఎంఎస్ఏ ప్రతినిధి చెప్పారు.

ఈ ఏడాది మొత్తం 100 అంతరిక్ష ప్రయోగాలు చేసి నాసాను వెనక్కినెట్టాలని చైనా నిర్ణయించింది. విశ్వాన్ని అన్వేషించి అంతరిక్ష రంగంలో బలమైన శక్తిగా ఎదగాలని రెండేళ్ల క్రితమే ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. చైనాలో అంతరిక్ష కార్యక్రమాన్ని సైన్యం నిర్వహిస్తోందని కొన్నేళ్లక్రితం ఆరోపణలు వచ్చాయి. దీంతో బీజింగ్‌ను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) కార్యకలాపాల నుంచి దూరం పెట్టారు. ఈనేపథ్యంలో సొంతగానే తియాంగాంగ్ పేరిట ఏర్పాటుచేసుకొని ప్రయోగాలు చేపడుతోంది. ఒక దేశం సొంతంగా ఏర్పాటుచేసుకొన్న స్పేస్ స్టేషన్ అది.